కథా కౌముది

# రామగీత

- పి.వి.రామచంద్రశర్మ

**భగవద్గీత 4 వ అధ్యాయం, 34 వ శ్లోకంలో, శ్రీ శ్రీ భగవాన్ ఇలా శెలవిచ్చారు.**

శ్లో: తద్విద్ధి ప్రణి పాతేన పరి ప్రశ్నేన సేవయా!

ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్వదర్శినః!!

దాని తాత్పర్యం ఏమిటంటే

"నీవు తత్వం దర్శించిన జ్ఞానులకడకేగి, ఆ జ్ఞానమును గ్రహించుము. వారికి దండప్రణామములాచరించుట వలనను, సేవలొనరించుటవలనను, కపటము లేకుండా భక్తిశ్రద్ధలతో, సముచిత రీతిలో ప్రశ్నించుట వలనను పరమాత్మ తత్వమును, చక్కగా నెఱింగిన జ్ఞానులు సంప్రీతులై, నీకు ఆ పరమాత్మ తత్వజ్ఞానమును ఉపదేశించెదరు.

అక్కడవరకు చెప్పి, ఆగి ఓ దమ్ము పూర్తిగా పీల్చుకుని, రింగులు రింగులుగా పొగని గాలిలోకి వదిలారు శ్రీదశరథరామయ్యగారు.

అది రాజమండ్రిలోని గోదావరి నదీ తీరంలో చల్లగాలి వీచే పార్కు. సాయంత్రం ఐదు గంటలనుంచీ రాత్రి పదకొండు గంటలవరకూ, ఆ పార్కు అనేక మందికి కాలక్షేపానికీ, కోరికలు తీర్చుకోవడానికి, ఆశ్రయమిస్తుంది. రిటైరైన వాళ్ళు, ప్రేమికులు, బిచ్చగాళ్ళు, ఏ పనీలేనివాళ్ళు, తినుబండారాలు, సిగరెట్లు, బీడీలు అమ్ముకునేవాళ్ళూ, కాముకులను వలలో వేసుకొనే వ్యభిచారిణులు, వాళ్ళని కంట్రోలు చేసే బ్రోకర్లు, రాజకీయనాయకులు, ఇలా పార్కులో సేద తీర్చుకునే వాళ్ళు కోకొల్లలు.

పార్కులో మన్మథరావుగారు, మోహనరావుగారు, దశరథరామయ్యగారూ, రోజూ కలుసుకుంటారు సాయంత్రంవేళ. రోజుకొక్కరు చొప్పున వాళ్ళనుభవాలు వివరించడము, కిమ్మనకుండా మిగతావాళ్ళు వినడము వారి సాయంకాల సమావేశపు నీతి.

- తల - మచ్చుకైన జుత్తు లేనిది,
- నుదురు - వెడల్పైనది
- దేహఛాయ - పసిడిది

. కట్టిన పంచె ప్రీమియర్ మిల్సుది

. లాల్చీ - ఖాదీది

. మెదడు - అమెరికన్ డాలరంత బలమైనది, పదునైనది.

అతనే మన కథానాయకుడు దశరథరామయ్యగారు.

. మన్మథరావు గారు, శ్రీకాకుళం జిల్లాలో పుట్టి, కోస్తా ఆంధ్రాలో రెవెన్యూ డిపార్టుమెంట్లో, తనదైన శైలిలో మూడు దశాబ్దాలు ఏకచ్ఛత్రాధిపత్యంగా ఓ వెలుగు వెలిగి రిటైరైన తాసిల్దారు గారు. మన్మథరావులో కోటికి ఒక వంతైన మన్మథ లక్షణాలు ఉన్నాయని ఏ స్త్రీ ఒప్పుకోనంత అందగాడు ఆయన.

. మోహనరావుగారు నిజంగా సమ్మోహనరావే. మూడు వందల ఎకరాల మాగాణికి అధిపతి. మూడు జిల్లాల పంటల పోటీలో వరుసగా మూడు సంవత్సరాలు అధికవరి దిగుబడి సాధించిన మేటి కృషీవలుడు ఆయన.

మాట నాస్తి.

కృషి జాస్తి

అతని కప్పగించిన పని కలిగిస్తుంది తృప్తి.

బాధ్యతలన్నింటిని నిర్వర్తించుకున్న అదృష్టవంతులా ముగ్గురూ. ఏ కొరతా లేని వాళ్ళు. సరదాగా సాయంత్రాలు గడిపే అవకాశంగల త్రిమూర్తులే వాళ్ళు.

దశరథరామయ్యగారు (ఇకనుంచీ ద.రా అంటాను) ఓ బహుళజాతీయ కంపెనీలో సీనియరు వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేసి పదవీ విరమణ చేసారు.

ఆయనకి రాజమండ్రి, విశాఖపట్నం, హైదరాబాదు, బొంబాయిలలో, చెప్పుకునే స్థాయిలో ఇళ్ళు ఉన్నాయి. ఒక అబ్బాయి, ఇద్దరు అమ్మాయిలు వారి సంతానము. వాళ్ళందరికీ పెళ్ళిళ్ళై తలో దేశంలో పెద్ద పెద్ద ఉద్యోగాలలో ఉన్నారు. అంతటి అదృష్టవంతుడు ఎవరూ ఉండరు.

ద.రా మెట్రిక్‌తో చదువు ఆపేశాడు. చిన్నతనంలోనే తండ్రి చనిపోవడం వలన. అతని అన్నగారు మాత్రము బాగా చదివి బొంబాయిలో పెద్ద ఉద్యోగం చేసేవాడప్పటికే.

అన్నకి మన ద.రా.కి మధ్యలో నాలుగు కాన్పులు వాళ్ళమ్మగారికి పోయేయి. తండ్రి మరణానంతరం చదువు చెప్పించే నాథుడు కరువయ్యారు ద.రా.కి.

"డబ్బులు పంపితే అమ్మని నీకు అప్పగించి నా తిప్పలు నేను పడతాను" అని, అన్నయ్యకి ఉత్తరం వ్రాసాడు ద.రా.

"అమ్మ నాకే కాదు. నీకూ అమ్మే. డబ్బులెలా సంపాదిస్తావో నా కనవసరము. అప్పుడే అమ్మని బొంబాయి పంపించేలా అఘోరించు." అది అన్ననుంచీ వచ్చిన జవాబు.

స్నేహితుడు నరసింహారావు కోమటి. పుష్కలంగా డబ్బు ఉన్నవాడు. అతని దగ్గర ఓ పాతిక రూపాయలు అప్పు తీసుకుని పదిహేను కిలోల డబ్బా బిస్కట్టులు కొని దాన్ని వందగ్రాముల ప్యాకెట్టులు చేసి అవి అమ్మి ఖాళీ డబ్బా కూడా అమ్మి, మళ్ళా అలాగే అమ్మి మొత్తానికి సైకిలు మీద రిటైలు వ్యాపారం చేసాడు. అలా సంపాదించిన ఆ సొమ్ముతో అమ్మని బొంబాయి వెళ్ళి అన్నకి అప్పగించేడు.

ఆ మధ్యాహ్నం బొంబాయిలోని ఓ వీధిలో వెళుతూ మెడికల్ రిప్రెజెంటేటివ్ వాకిన్ ఇంటర్వ్యూ బోర్డు చూసి చూలోనికి వెళ్ళాడు ద.రా. అంతే ద.రా. సెలెక్టు అయ్యాడు. గోదావరి నీరు తాగి పెరిగిన మెదడు కదా. దంచేసేడు ఇంటర్వ్యూలో. అనుభవముందా అని అడిగిన ప్రశ్నకి బిస్కట్టుల కథ చెప్పేడు.

తెల్లవారే సరికల్లా ద.రా.రిప్రెజింటేటివుగా మారిపోయేడు.

ఏ శుభముహూర్తములో ప్రవేశించాడో ఉద్యోగంలో తెలియదు కానీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా అదే కంపెనీలో రిటైరయ్యాడు.

"మీ విజయ రహస్యం ఏమిటి?" అన్న మోహన రావుగారి ప్రశ్నకి బదులుగా, భగవద్గీతలో శ్లోకం, తాత్పర్యం చెప్పేరు ద.రా.

"మెట్రిక్ చదివిన నేను ఎలా అంచలంచలుగా ఎదిగానుఅంటే జ్ఞానం సంపాదించడము వలన.

శ్రీ భగవాన్ "జ్ఞానం సంపాయించిన వాళ్ళని పైన చెప్పినట్లు తృప్తి పరచి పొందండి జ్ఞానం" అన్నారు.

నిజజీవితంలో స్వార్ధం చేత, పెరుగుతున్న పోటీ తత్వం చేత, ఎవరైనా తమ జ్ఞానం తమకన్నా తెలివి తక్కువ వాళ్ళకి అందచేస్తారా చెప్పండి? ఎంత కాకా పట్టినా, ఎంత బాకా ఊదినా?

దీనికి నేనో ఉపాయం కనిపెట్టేను.

ఉద్యోగంలో స్థాయి పెరుగుతున్నంత సేపు నిర్ణయాలు తీసుకోవడము చాలా క్లిష్టమైన పని.

అందరినీ సంప్రదించాలి. ఏకపక్షంగా నిర్ణయించకూడదు. సంప్రదించినంత మాత్రాన ఎవ్వరూ సలహాలివ్వరు. ఎందుకంటే ఎవరి స్వార్ధం వాళ్ళది.

ఇక పుస్తకాలు చదివితే వాటిలో ఒక నిర్దేశించిన సూత్రం ప్రకారంగా థియరెటికల్‌గా ఉంటుంది జ్ఞానం.

"మనపైవాడూ చెప్పడు మనకి, నిర్ణయాలెలా తీసుకోవాలో" క్రిందివాళ్ళని అడగడం నామోషీగా ఉంటుంది.

సిగరెట్టుమీద సిగరెట్టు తాగుతూ ఓ రాత్రి అంతా నిద్రలేకుండా ఆలోచించిన తరువాత ఐడియా వచ్చింది.

ప్రతీ నిర్ణయం తీసుకునే ముందు, నేనో వాకిన్ ఇంటర్వ్యూ ఏదో ఒక చిన్న పోస్ట్‌కి పెట్టేవాణ్ణి.

ఉద్యోగం ప్రయత్నంలో ఉన్నవాళ్ళ మెదడు పాదరసంలా చురుగ్గా పనిచేస్తుంది. సమస్యలకు సమాధానం ఎప్పుడూ ఏ సమస్యాలేనివాళ్ళతో చర్చిస్తే దొరుకుతుంది. సమస్యతో సతమత మయ్యే వాళ్ళ మెదడు ఫ్రేము దాటి ఆలోచించే స్థితిని కోల్పోతుంది. మెదడు పని చేయదు.

ఉదాహరణకి "దక్షిణ కొరియా ప్రజలు దగ్గు వస్తే ఏం చేస్తారు?" అని టి.బి. ఆస్పత్రిలోని రోగులని అడగండి. బుఱ్ఱంతా వేస్టు చేసుకుంటారే కానీ జవాబియ్యలేరు. అదే ప్రశ్నని అప్పుడే మాటలు నేర్చిన ఓ బుడుగుని పిలిచి అడగండి. "దగ్గుతారు" అని బులెట్‌లా వస్తుంది జవాబు.

వాకిన్ ఇంటర్వ్యూలో భాగంగా నా సమస్యని ప్రశ్నగా ఇస్తే అనేక సందర్బాలలో జవాబు దొరికింది. అఫ్కోర్స్ నిజంగా నిపుణులైన వాళ్ళకి నేను టెంపరరి ఉద్యోగాలిచ్చేనుకూడా.

"దశరథరాముడుగా ఉన్న ప్రతీవాడు కొన్నాళ్ళకి సీతారాముడు" అవుతాడు.

తెలివి, అనుభవము ఉన్న తండ్రి చాటు బిడ్డగా ఉన్నప్పుడు ఎరగని తెలివితేటలు, చదువు, సంధ్యలేని భార్య వచ్చాక ఆవిడ ద్వారా సంపాదిస్తాడు.

జ్ఞానం రావాలంటే అజ్ఞానుల వలననే వస్తుంది అని నా అభిప్రాయం. ఏ స్వార్థం, ఏ సమస్యా లేని అజ్ఞానులు ఓపెన్ మైండ్ తో ఆలోచించి సమస్యకి సమాధానం కాకతాళీయంగా ఇస్తారని నా నమ్మకము.

శంకర భగవత్పాదులు వారికి చండాలుడు జ్ఞానోపదేశం కలిగించలేదా?

కౌంట్ ఆఫ్ ఆబట్స్‌బరిలో షెఫర్డ్ (కౌ బోయ్), ఇలా అనేక అజ్ఞానులు చరిత్రలో, పురాణాల్లో జ్ఞానాన్ని ఇచ్చినట్లు ఉదాహరణలు ఉన్నాయి.

వాళ్ళకి నమస్కరించక్కర్లేదు. సేవలు చేయక్కర్లేదు. "ప్రత్యుపకారం చేస్తే చాలు." ఏ చదువూ లేని మన నాయనమ్మలు, అమ్మమ్మలు జీవితానుభవం అనే విశ్వ విద్యాలయాలిచ్చిన పట్టాల జన్యుపరంపర వలననే, ఈనాడు విదేశాల్లో కూడా మన బావుటా ఎగరవేస్తున్నాము అనే విషయం మనం మరువకూడదు.

"ఇదే నా విజయ రహస్యం" ముగించారు మన ద.రా..

ఆయన మిత్రులకు "కృష్ణ గీత" కాకుండా "రామగీత" వినిపించారు.